క్లుప్తంగా

నూకాలమ్మ సేవలో మేయర్ నూర్జహాన్



నూకాలమ్మను దర్శించుకున్న నూర్జహాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని నూకాలమ్మవారి ఆలయంలో అమ్మవారిని నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. అమ్మవారి కరుణాకటాక్ష వీక్షణాలు నగర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు మేయర్ నూర్జహాన్‌కు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి కృష్ణ, వెల్లంకి రాజు, జనపరెడ్డి కృష్ణ, గొంతిన రామకృష్ణ, బావిశెట్టి కేశవ, నక్కా నాగేశ్వర రావు, తనకాల లక్ష్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు రజక జన మహాసభ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన మహాసభను సోమవారం ఏలూరులోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య పేర్కొన్నారు. ఈ సభలో రజకుల సమస్యలపై చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవదుర్గ పూజలు



నవదుర్గ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దుర్గాసప్తశతి బృందం ప్రతినిధులు అమ్మవారి ఆవాహన అష్టోత్తర సహస్రనామ పూజలు, నవదుర్గ పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు, తిరిగి సాయంత్రం 5 గంటలకు 310 మంది మహిళలు పాల్గొనగా, లలితా సహస్రనామ కుంకుమార్చన ఐదేసి సార్లు నిర్వహించారు. దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఏలూరులో పొట్టి శ్రీరాములు పార్క్

- ఇడా నిధులు రూ.12 లక్షలతో పార్క్ అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో సంఘ అధ్యక్షులు బ్రహ్మయ్య, ఇడా చైర్మన్ బొద్దాని

ఏలూరు టౌన్: స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు పార్కును ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ నిధులు రూ.12 లక్షలతో సుందరంగా ఆకర్షణీయంగా అభివృద్ధి చేశారు. దీనిని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చేతులమీదుగా ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే నాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఏలూరు నగరంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, నగర ప్రజల వందలాదిగా తరలివచ్చారు. అనేక ఏళ్లుగా ఉన్న తమ కోరికను నెరవేర్చిన ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాములు ఆశయాలు స్ఫూర్తి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను సైతం బలిగా అర్పించిన మహనీయులు, త్యాగశీలి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. తెలుగు ప్రజలంతా ఒకే ప్రాంతంలో జీవించాలనే గొప్ప ఆకాంక్షతో ఆమరణ దీక్ష చేసి రాష్ట్ర ఏర్పాటుకు తన ప్రాణాలను సైతం త్యజించేందుకు సిద్ధపడిన శ్రీరాములును స్ఫూర్తిగా తీసుకుని జాతి సమైక్యతకు కృషి చేయాలని కోరారు. ఏలూరు అర్బన్ జిల్లా అధ్యక్షుడు చలువది బ్రహ్మయ్య మాట్లాడుతూ అడిగిన వెంటనే పొట్టి శ్రీరాములు పార్కును అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే నానికి ఆర్యవైశ్య సంఘం తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సంఘ కార్యదర్శి మోటమర్రి సదానందం మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల పట్ల సానుకూల దృక్పథంతో తమకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నానిని అభినందించారు. ఆర్యవైశ్య నాయకులు మద్దుల సత్యకుమార్, తడికిమల్ల సుబ్బారావు, వాసవి సుబ్బారావు, చక్క రాజా మాట్లాడుతూ ఏలూరులో గత ఐదేళ్లుగా ఆర్యవైశ్యులు అడిగిన ప్రతి పనినీ పూర్తి చేయటం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక మంది ఆర్యవైశ్యులకు ఇళ్ల పట్టాలు అందాయనీ, మొట్టమొదటి సారిగా పేద మహిళలకు ఈబీసీ నేస్తం పథకం ద్వారా లబ్ధి చేకూరిందని తెలిపారు. కార్యక్రమంలో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఇడా వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఆర్యవైశ్య ప్రముఖులు నేరెళ్ల రాజేంద్ర, గోల్డ్ మర్చంట్స్ ప్రెసిడెంట్ తమ్మన మధు, పైడేటి రామారావు, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న శ్రీను, యువజన అధ్యక్షులు బొలిశెట్టి సురేష్‌కుమార్, సేవాదళ్ అధ్యక్షులు దిలీప్, కోఆప్షన్ సభ్యులు గుడివాడ రామచంద్రకిషోర్, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు, ఆర్యవైశ్యులు ఉన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్‌ను ఆదుకోవాలి



యూనియన్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎలక్ట్రికల్ వర్కర్స్‌ను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర కమిటీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమల్లు శ్రీనివాసరావు, బొజ్జా రామకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల మంది విద్యుత్ వర్కర్స్ ఉన్నారన్నారు. కార్మికుల పెండింగ్ క్లెయిములు వెంటనే చెల్లించాలని, వర్కర్స్‌కు టూల్ కిట్స్ అందించాలని, మెప్మా ఆధ్వర్యంలో వర్కర్స్‌కు రుణాలు అందించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి పథకాలను అమలు చేయాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్ ఉపాధ్యక్షుడు టి.తారక్‌నాథ్, దాల్ఫిన్ బత్తిన శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు కె.రాజకుమార్, నాయకులు షేక్ రజాక్,పీడీ రాజేశ్వరరావు,ఎం.మణి, కె.అశోక్ కుమార్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లోనూ తాగునీటికి ప్రణాళిక



సుంకరవారితోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



హాజరైన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు గ్రామాల్లోని ప్రజలకు గోదావరి జలాలను తరలించి ఇంటింటికీ తాగునీటి సరఫరా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ఉన్నామని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 6వ డివిజన్ సుంకరవారితోట పంచాయతీ కార్యాలయ రోడ్డులో గుర్రం ధర్మ ఇంటివద్ద డివిజన్ కార్పొరేటర్, పార్టీ క్లస్టర్-1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాని ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారితో మమేకం అయ్యారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ 100 ఎకరాల్లో మంచినీటి చెరువు ఏర్పాటు చేయటంతోపాటు ప్రతి ప్రాంతంలోనూ ఓవర్‌హెడ్ వాటర్ రిజర్వాయర్లు నిర్మించి, పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇంటింటికీ నీటి సరఫరా చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే తాగునీటి సరఫరాకు సంబంధించి ఏలూరు నగరానికి రూ.175 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారని స్పష్టం చేశారు. గతంలోనూ ఏలూరు నగరంలోని ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని, ఆశ్రం హాస్పిటల్ సమీపంలో భారీ ఎత్తున 110 ఎకరాల తాగునీటి చెరువును ఏర్పాటు చేయటం ద్వారా నేడు వేసవిలో సైతం నీటి సమస్య ఉత్పన్నం కావటం లేదని గుర్తు చేశారు. సమావేశంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏలూరు కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కమిటీల ఎంపిక

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నగర కమిటీ, నగర అనుబంధ కమిటీల్లో పలువురు నేతలకు పదవులు కేటాయిస్తున్నట్టు పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో వీరంతా పనిచేస్తారని చెప్పారు. పార్టీ ఏలూరు నగర సెక్రటరీలుగా బొడ్డేటి సుబ్బారావు, సవలవరపు నారాయణరావు, మైనార్టీ సెల్ ఏలూరు నగర సెక్రటరీగా షేక్ ఖాదర్ బాబా, బీసీ సెల్ ఏలూరు నగర సెక్రటరీగా కేజీవీఎస్ పుండరీకాక్షుడు నియమితులైనట్టు చెప్పారు.

వ్యాపార విస్తరణకు బైలా సవరణ



సభలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ది ఏలూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (టికు బ్యాంక్) వ్యాపార పరిధిని మరిన్ని జిల్లాలకు విస్తరించేందుకు బైలా సవరణ చేస్తూ తమ బ్యాంక్ మహాజన సభ నిర్ణయించిందని బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఏర్పాటుచేసిన టికు బ్యాంక్ మహాజన సభకు అంబికా ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు 2,684 మంది సభ్యులకు రూ.32.46 కోట్లు రుణాలుగా మంజూరు చేశామని, అలాగే ఖాతాదారుల నుంచి రూ.16.21 కోట్లను డిపాజిట్లుగా సేకరించామని వివరించారు. గత ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు కొత్తగా చేరిన సభ్యత్వాలు, వాపసు చేసిన వాటా ధనాన్ని సభలో ఆమోదించామన్నారు. ప్రస్తుతం టికు బ్యాంక్ వ్యాపార పరిధి ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల్లో విస్తరించి ఉందని, ఈ పరిధిని గుంటూరు, అనకాపల్లి జిల్లాలకు విస్తరించేందుకు బైలా సవరణకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో బ్యాంక్ సీఈఓ ఎం అచ్యుతరావు, పలువురు డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన స్వరాంజలి కార్యక్రమం



ఘంటసాల పాటలు పాడుతున్న గాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల, హైదరాబాద్‌కు చెందిన గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా శనివారం ప్రారంభమైన స్వరాంజలి కార్యక్రమం ఆదివారం ముగిసింది. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో రెండో కార్యక్రమంలో పలువురు గాయకులు సుమారు 100 పాటలను ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఘంసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు రేవతి రామ్‌కుమార్, లంకా వెంకటేశ్వర్లు, మనస్విని, టి.సాయి కుమార్, వి.రాజేష్ మీనన్, సీహెచ్ కల్యాణ్, డి.నరేష్ తదితర గాయకులు ఘంటసాల పాటలను శ్రావ్యంగా ఆలపించారు. గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ అధినేత టి.గోవిందరావు సంగీత సారథ్యంలో వి.రామ్‌కుమార్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాక్షేత్రం అధ్యక్షుడు బీవీ రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజావలీ పర్యవేక్షించారు.

ప్రజలకు సేవ చేయడం గొప్ప విశేషం



దాతలను సత్కరిస్తున్న హేలాపురి లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరంలో 48 సంవత్సరాలుగా హేలాపురి లయన్స్ క్లబ్ నిత్యం ప్రజలకు సేవ లందించడం గొప్ప విశేషమని ఏలూరు జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.రాంగోపాల్ అన్నారు. హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వికలాంగులకు కృత్రిమ కాళ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంగోపాల్ మాట్లాడుతూ ప్రకృతి వలే నిస్వార్థంగా సేవలు అందించి తమ జన్మను సార్థకం చేసుకోవాలని సూచించారు. లయన్స్ జిల్లా ఉప గవర్నర్ కాకరాల వేణు బాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్బులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కేవీ రావు, కార్యదర్శి బొల్లా సత్యనారాయణ, కోశాధికారి డి.రమాదేవి, ప్రోగ్రాం చైర్పర్సన్ రావి పద్మకుమారి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి కృత్రిమ కాళ్లు అందజేశారు. సుమారు రూ.6 లక్షల విలువచేసే కృత్రిమ కాళ్లను అందించిన నగరానికి చెందిన డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య కుమార్తె ప్రవాస ఆంధ్రులు డాక్టర్లు కె.హిమబిందు, కె.శ్రీనివాస ప్రసాద్ దంపతులను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఖమ్మం రోటరీ క్లబ్ ప్రతినిధులు పి.రంగారావు, డి.సాంబశివరావు, లయన్స్ రీజియన్ చైర్మన్ వి.మల్లికార్జునరావు, జోన్ చైర్మన్ కుర్మా శ్రీనివాస్, పూర్వపు గవర్నర్లు డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు, వల్లూరుపల్లి మురళీ మోహనరావు, జిల్లా నాయికులు ఎల్ వెంకటేశ్వరరావు, క్లబ్ నాయుకులు దాసర గణేష్ బాబు, శానం మురళీకృష్ణ, వి.వెంకటేశ్వరరావు, దువ్వి హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జి కాంతారావుకు పురస్కారం



మానవత విద్యానిధికి చెక్కు అందిస్తున్న కాంతారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ చిత్రకళాకారుడు మజ్జి కాంతారావును మానవత ప్రతిభా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. మానవత సంస్థ ఏలూరు యూనిట్ నెలవారీ సమావేశం ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. చిత్రకళారంగానికి కాంతారావు చేసిన సేవలు విశేషమైనవని, తనదైన శైలిలో విభిన్న చిత్రాలను చిత్రీకరించి నగరానికి రాష్ట్ర స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావడంలో కృషి చేస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. కాంతారావు తన తల్లితండ్రులు పేరున మానవత జిల్లా విద్యానిధికి రూ.25 వేల చెక్కును చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్పై పీవీవీ రమణ మానవత సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు దేవినేని భాస్కరరావు, పోలవరపు దేవరత్నాకరరావు, అడుసుమిల్లి నిర్మల, కడియాల కృష్ణారావు, మానేపల్లి సత్యనారాయణ, వాసిరెడ్డి శేషగిరిరావు, వల్లూరుపల్లి సాయి సుధ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	60	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	48
కాకర కాయలు	44-50	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
కాలీఫ్లవర్	25-30	అల్లం	120
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	30-40	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24-30	బఠాణీ	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు



పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి









అభ్యర్థులను పరిశీలిస్తున్న పోలీసులు

కొలువు కోసం

ఏలూరులో ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ పటిష్టంగా నిర్వహించింది. ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. ఏలూరు నగరంలోని ప్రధాన పాఠశాలలన్నింటిలోనూ ఈ పరీక్షలు నిర్వహించారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల సందడికి సంబంధించిన దృశ్యాలివీ.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు





పరీక్ష రాసేందుకు వడివడిగా ఆయా కేంద్రాలకు వస్తున్న అభ్యర్థులు